వృద్ధులకు వెలుగు రేఖ

- ఆసరా అవుతున్న వైఎస్సార్ కంటి వెలుగు
- డివిజన్‌లో 29,380 మందికి కంటి పరీక్షలు
- 12,906 మందికి కళ్లజోళ్లు, 365 మందికి శస్త్రచికిత్సలు
- మూడో విడత ప్రారంభం



జెడ్.మేడపాడు సచివాలయంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

మండపేట: సర్వేంద్రియాణాం నయనం ప్రధానం. చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమవుంది. బతుకు భారంగా మారుతుంది. కంటి సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులు, చిన్నారులకు వరంగా మారింది. కంటి సమస్యలో బాధపడుతున్న వారిలో వెలుగు రేఖలు నింపుతోంది. ఇప్పటికే రెండు విడతలు పూర్తి కాగా మూడో విడత కంటి పరీక్షలు ముమ్మరంగా సాగుతున్నాయి. రామచంద్రపురం డివిజన్‌లో ఇప్పటి వరకు 29,380 మందికి కంటి పరీక్షలు చేయగా, 12,906 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 365 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు.

కంటి సమస్యలు ఉన్నవారికి...

2019 అక్టోబరులో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రారంభించగా మొదటి విడతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య బృందాలు శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కోవిడ్ అనంతరం రెండో విడతగా గ్రామ, వార్డు సచివాలయాల్లో వృద్ధులకు పరీక్షలు చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వారికి ఐ డ్రాప్స్, మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. సమస్య తీవ్రత అధికంగా ఉన్న వారికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. డివిజన్‌లోని మండపేట నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 18,400 మందికి పరీక్షలు నిర్వహించగా 8,406 మందికి కళ్లజోళ్లు, 230 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం అర్బన్, రూరల్, కె గంగవరం మండలాల పరిధిలో 10,980 మందికి పరీక్షలు చేసి 4,500 కళ్లజోళ్లు, 135 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేశారు.

రామచంద్రపురం డివిజన్‌లో కంటి పరీక్షల వివరాలు

మండలం	కంటి పరీక్షలు	కళ్లజోళ్లు	శస్త్రచికిత్సలు
మండపేట అర్బన్, రూరల్	11,000	4306	105
రాయవరం	3000	1800	40
కపిలేశ్వరపురం	4400	2300	85
రామచంద్రపురం అర్బన్, రూరల్	8000	3100	95
కె.గంగవరం	2980	1480	40

ప్రజలకు చేరువగా...



వైఎస్సార్ కంటి వెలుగు పథకం కంటి వైద్య సేవలను ప్రజలకు ఎంతో చేరువ చేసింది. శిబిరాలను ప్రజలు బాగా వినియోగించుకుంటున్నారు. ఆస్పత్రులకు వెళ్ల లేనిఎంతో మందికి వరంలా ఉంది. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం.

– డాక్టర్ ఎ.హేమలత, జిల్లా అంధత్వనివారణ ప్రోగ్రాం మేనేజర్

రూపాయి ఖర్చు లేకుండానే..



వయస్సు పైబడడంతో కంటి చూపు మందగించింది. వైఎస్సార్ కంటి వెలుగు కింద కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోడు, మందులు ఇచ్చారు. ఇప్పుడు కంటి చూపు ఎంతో మెరుగుపడింది.

– ఎస్.సత్యవతి, పసలపూడి

ఇంటికి వెళ్లి మరీ..

మొదటి రెండు విడతల్లో మిగిలిన వారి కోసం మూడో విడత కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. కంటి వైద్యులు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి కంటి పరీక్షలు చేస్తున్నారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించి వారం పది రోజుల్లో వలంటీర్ల ద్వారా నేరుగా వారి ఇళ్లకే కళ్లజోళ్లు పంపిస్తున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి రామచంద్రపురం, రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. చెంతకే వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుండడంపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

వడ్లమూరులో పీఎంజేఏవై సర్వే

కపిలేశ్వరపురం: వైద్య ఆరోగ్య శాఖ అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శివరంజని, కరుణేంద్రకుమారి ఆదేశాల మేరకు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఉద్యోగులు, సిబ్బంది పీఎంజేఏవై సర్వే చేపట్టారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్త పి.విజయదుర్గ, ఆశ కార్యకర్తలు ఎస్.శిరీష, ఎన్.చంద్రకుమారిలు శనివారం వడ్లమూరులోని ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన రోగ్య యోజన (పీఎంజేఏవై)లో అర్హులను గుర్తించి వారి వివరలను యాప్‌లో నమోదు చేశారు.

ప్రమాణాల మేరకు డ్రోన్ సర్వే



టేకిలో డ్రోన్ సర్వేపై సూచనలు చేస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన డ్రోన్ సర్వేను నిర్దేశిత ప్రమాణాల మేరకు నిర్వహించాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని టేకి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. సర్వే వివరాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు ఆర్డీవోకు వివరించారు. 10 గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందని చెప్పారు. ఆర్డీఓ మాట్లాడుతూ సర్వే ప్రక్రియపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట సర్పంచ్ కుక్కల నాగమణి, సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్, వీఆర్వోలు అల్లాడి మల్లేశ్వరరావు, జాన్, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు ఉన్నారు.

వల్లూరులో గర్భిణులకు సీమంతం

కపిలేశ్వరపురం: వల్లూరు గ్రామంలోని 26వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో గర్భిణులకు శనివారం సీమంతం నిర్వహించారు. ఆ పంచాయతీ సర్పంచ్ దాసి మీనా కుమారి గర్భిణులకు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, పండ్లు అందజేసి సీమంతం చేశారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ గెద్దం ప్రమీల, అంగన్‌వాడీలు ఎస్ఎల్ లక్ష్మి,ఎస్.యర్రాయమ్మ, పి.విజయ కుమారి, వైద్యఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

122 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పడమరఖండ్రిక గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలుపెద్దిరెడ్డి శేషారత్నం సందర్శించారు. గ్రామానికి చెందిన 122 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులను ప్రశ్నిస్తున్న నాగమణి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నాగమణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఈ నెల 21 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారంగా ప్రభుత్వం అందించనున్న రాగి జావ ట్రయల్ రన్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను వాడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు-నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు పీఎస్‌బీఎస్‌కే సుందరి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదకు చెందిన బాలిక పి.మణికుమారి మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ కోరారు. బాలిక కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. బాలిక కాకినాడ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటూ మృత్యువాత పడడంలో హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం ఉందన్నారు. డెంగీ వ్యాధి సోకిన బాలికకు సకాలంలో చికిత్స అందించలేదని, తల్లిదండ్రులకు విషయం తెలియజేయలేదని అన్నారు. బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎ.కృష్ణ, పి.బసవయ్య, పి.శ్రీను, పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సీతారాముల బ్రహ్మోత్సవాలు

వారం పాటు స్వామివారి వేడుకలు



బ్రహ్మోత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న గణేశ్వరరావు దంపతులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలో కొలువైన సీతారామచంద్ర స్వామి వారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28న ప్రారంభం కానున్నాయి. అందుకోసం ఆలయ ధర్మకర్త మల్లిపూడి గణేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు, మల్లిపూడి వెంకటేశ్వరరావు, సాయి లక్ష్మి దంపతులు శనివారం ఆలయ అర్చకుడు వరదాచార్యులు పర్యవేక్షణలో పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ 28 ఉదయం భక్తులు స్వామివారి మాలధారణ, అనంతరం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయన్నారు. 29న ధ్వజారోహణం, ఎదుర్కోలు ఉత్సవం, 30న సీతారామచంద్ర స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవం, 31న శ్రీరామ పట్టాభిషేకం, ఏప్రిల్ 1న లక్ష తులసిపూజ, 2న మహాపూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహిస్తారని తెలిపారు.వేడుకల్లో భాగంగా రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. స్వామివారి మాల ధారణ చేసే భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తామని గణేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి శివానందప్రసాదశర్మ, పుల్లేటికుర్తి రాంబాబు, పొన్నూరు అనంత భరద్వాజ్, మెర్ల పుల్లయ్యచౌదరి, పసల కొండ, కొనగళ్ల సత్యనారాయణ, యాదగని వెంకట్రావు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశుని జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్ర పూజలను శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి గో ఆధారిత పదార్థాలతో అభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు దాసర లక్ష్మణమూర్తి, పెద్దింశెట్టి రామస్వామి, వెల్ల శ్రీను, సూరంపూడి వెంకట్రావు, వాసా కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మండపేట: మండలంలోని జెడ్.మేడపాడులో రెండు రోజుల క్రితం బాలుడు కిడ్నాపైన కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. రూరల్ ఎస్సై బి.శివకృష్ణ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. పి.సూరిబాబు అనే వ్యక్తి తన భార్య చిన్నారి, ఇద్దరు పిల్లలతో కలిసి జెడ్.మేడపాడు బస్ షెల్టర్‌లో నివసిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో యాక్టివా స్కూటర్‌పై ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు వచ్చి, బస్ షెల్టర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. అనుమానం వచ్చిన సూరిబాబు ప్రశ్నించగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఎవరూ లేని సమయంలో సూరిబాబు మూడేళ్ల కుమారుడు ప్రభును అపహరించుకుపోయారు. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరానికి చెందిన వరదా చంద్రమోహన్, ధవళేశ్వరానికి చెందిన నవుడు భవాని, తొండవరపు గౌతమి కలిసి ముఠాగా ఏర్పడి, పిల్లల్ని కిడ్నాప్ చేసి, వేరొకరికి అమ్ముతుంటారని పోలీసులకు తెలిసింది. వారే చిన్నారి ప్రభును కిడ్నాప్ చేసి, విజయవాడలో అమ్మేందుకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్టు సమాచారం అందింది. దీంతో ఎస్సై శివకృష్ణ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, కిడ్నాప్‌నకు ఉపయోగించిన హోండా యాక్టివా స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురినీ అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచి, రిమాండుకు తరలించారు. బాలుడు ప్రభును అతడి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉపాధి పథకంపై కుట్ర



శీలలంకలో కూలీలకు కరపత్రాలు పంచుతున్న ఈశ్వరరావు

కాజులూరు: ఉపాధి హామీ పథకాన్ని దశల వారీగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం, రైతుకూలీ సంఘం సభ్యులు పర్యటించి ఉపాధి హామీ రక్షణ కోసం ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు పంచుతూ ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బడ్జెట్‌లో 30 వేల కోట్లు కోత విధించి బీజేపీ ప్రభుత్వం ఉపాధి పథకానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ఇప్పటి వరకూ ఉన్న గ్రూపు మేట్లను మార్చి 40 కుటుంబాలకు ఒక మేటును నిర్ణయించి వారికి హోదా కల్పిస్తున్నట్టు భ్రమింపజేసి, ఎటువంటి పారితోషకం ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకోవాలని చూస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు తగిన వేతనం ఇవ్వాలని ప్రతి కుటుంబానికి 200 పని దినాలు, రోజుకు 600 వతనం ఇవ్వాలన్నారు. డిమాండ్ల సాధన కోసం అందరూ ఢిల్లీ తరలిరావాలన్నారు.

రూ.2 లక్షల నగదు చోరీపై కేసు

రామచంద్రపురం రూరల్: తన షాపు నుంచి రూ.2 లక్షలు నగదు చోరీకి గురైనట్టు తాళ్లపాలానికి చెందిన బొడ్డు శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డు శ్రీను తల వెంట్రుకల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 14వ తేదీన రామచంద్రపురం యూనియన్ బ్యాంకు నుంచి రూ.2,50,000 నగదు డ్రా చేశాడు. అందులో రూ.2,00,000 తాళ్లపాలంలోని తన షాపులో క్యాష్ కౌంటర్‌లో పెట్టి మిగిలిన రూ.50 వేలతో వ్యాపారం నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లి వచ్చాడు. 16న రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి తన షాపునకు వెళ్లగా తాళాలు పగలకొట్టి ఉండడం గమనించాడు. లోపలకి వెళ్లి చూడగా క్యాష్ కౌంటర్‌లో పెట్టిన రూ. 2లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. సీసీ కెమెరా పరిశీలించగా బొడ్డు జయబాబు, నామాల చంటిబాబు అనే వాళ్లు తన సొమ్ము దొంగిలించినట్టు గుర్తించి ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వినోద్ తెలిపారు.

పేదల సంక్షేమమే ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు లక్ష్యం

- వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి
- 350 మందికి హోమియో వైద్య సేవలు



మందులు అందజేస్తున్న ట్రస్టు వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణ, మహిళల ఆర్థిక స్వావలంబన, హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తోందని ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి అన్నారు. అర్తమూరులోని ట్రస్టు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన 157వ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని లక్ష్మణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో తన తండ్రి బులిస్వామిరెడ్డి రెండున్నర దశాబ్దాల క్రితం ట్రస్టును స్థాపించిన నిరంతర శ్రామికునిగా నేటికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మణరెడ్డి కోరారు. అనంతరం 350 మంది రోగులకు రాజమహేంద్రవరానికి చెందిన అల్లు రామగలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు వైద్య సేవలు అందించి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించి సంబంధిత మందులు, విటమిన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత మండ నాగిరెడ్డి, ట్రస్టు సభ్యులు తాడి కోదండరామారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, తాడి సుబ్బిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, టీవీఎస్ఎన్ మూర్తి, ఓగిరెడ్డి రామారెడ్డి, చింత వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రూ.17.89 కోట్లతో అభివృద్ధి

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- మున్సిపల్ పాలవర్గ రెండేళ్ల వేడుక



ద్వితీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: గత రెండేళ్లలో మండపేట పట్టణంలో రూ.17.89 కోట్లతో 143 అభివృద్ధి పనులు చేపట్టి దాదాపు పూర్తి చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం చైర్‌పర్సన్ చాంబర్‌లో దుర్గారాణి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పోరాట పటిమ టీడీపీని ఘోరంగా ఓడించి మండపేట మున్సిపల్ చరిత్రను తిరగ రాసాయన్నారు. రెండేళ్ల పాలనలో పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన ప్రగతిని వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని దుర్గారాణి అన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికి స్వీట్లు పంచారు. వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్య, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, ఎర్నేని ప్రభావతి, మందపల్లి రవికుమార్, కొవ్వాడ బేబీ, మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కళ్యాణి, గ్రంధి శ్రీనివాసు, మెండు బాపిరాజు, బొక్కా సరస్వతి, జొన్నపల్లి విజయలక్ష్మి, ముక్కా మేరీ స్వరూపరాణి, అమలదాసు లక్ష్మి, మొండి భవాని, పిల్లి శ్రీనివాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం: ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్టు పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 12 సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి శనివారం ప్రకటించారు. నిర్దేశించిన కేంద్రంలో స్థానిక వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈఏడాది జూలై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు గల టెన్త్ ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. దరఖాస్తులు కపిలేశ్వరపురంలోని తన కార్యాలయంలో తీసుకుని ఈనెల 31 సాయంత్రం 5 లోగా తిరిగి కార్యాలయంలో అందజేయాలన్నారు. కె.గంగవరం 3వ నంబరు కేంద్రంలో కార్యకర్త పోస్టుకు ఓసీ అభ్యర్థికి కేటాయించారు. సహాయకుల పోస్టులకు సంబంధించి రావిదొడ్డిపేట, కపిలేశ్వరపురం-7 కేంద్రాలను ఎస్టీకి కేటాయించారు. కేదారిలంక-1 ఎస్సీ, పడమర ఖండ్రిక-4, నరజాడ పోస్టులను బీసీ ఇ, నల్లూరు-1, వెలగతోడు-1 బీసీ డి, కపిలేశ్వరపురం09 బీసీ బి, తామరపల్లి ఓసీ (ఓహెచ్), బ్రహ్మపురి, టేకి-1, అంగర-4లను ఓసి అభ్యర్థులకు కేటాయించినట్టు తెలిపారు.

కె.గంగవరం: మండల పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కపిలేశ్వరపురం ప్రాజెక్టు సీడీపీఓ గజలక్ష్మి శనివారం ఒక ప్రకటనతో తెలిపారు. మండల పరిధిలోని కె.గంగవరంలోని నెంబర్-3 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఓసీ రిజర్వేషన్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు నరజాడ- బీసీ-ఈ, తామరపల్లి- ఓసీ(ఓహెచ్), రావిదొడ్డిపేట (ఎస్టీ), బ్రహ్మపూరిలో ఓసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయ పని వేళల్లో కపిలేశ్వరపురంలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద దరఖాస్తులు అందించాలని కోరారు.

గేటెడ్ కమ్యూనిటీలకు దీటుగా వసతులు



తాపేశ్వరంలో గృహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: జగనన్న కాలనీలతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు దీటుగా జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. మండలంలోని తాపేశ్వరం కాలనీలో జరుగుతున్న పేదల ఇళ్ల నిర్మాణం, వాటర్ పైప్‌లైన్లు, విద్యుత్ లైన్లు, తదితర పనులను శనివారం ఎంపీపీ వాసు పరిశీలించారు. గృహప్రవేశాలు చేసుకునే లబ్ధిదారులకు వెంటనే కరెంటు మీటర్లు ఇవ్వడంతో పాటు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో కాలనీకి వచ్చే అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో పనులు మొదలవుతాయని ఎంపీపీ వాసు తెలిపారు. అనంతరం ఎస్సీ కాలనీలో రోడ్లను పరిశీలించారు.

ట్రయల్ రన్‌గా విద్యార్థులకు రాగి జావ

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ఇపుడు కొత్తగా ఉదయం పూట అల్పాహారంగా రాగి జావను విద్యార్థులకు అందజేస్తున్నట్టు ఎంఈవో వై.సత్యనారాయణ తెలిపారు. రాయవరం నంబర్-1 ప్రాథమిక పాఠశాలలో శనివారం రాగిజావ ట్రయల్ రన్‌లో భాగంగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించడంతో పాటుగా, పోషకాలు అందించేందుకు రాగిజావ ఎంతో మేలు చేస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఇష్టంగా ఈ జావను తీసుకున్నట్టు తెలిపారు. సోమవారం కూడా రాగిజావ పంపిణీ ట్రయల్ రన్ ఉంటుందని, ఈ నెల 21 నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుంటూరి అప్పారావు, సీఆర్పీలు కె.నీనాసిరి, వి.సీతాదనలక్ష్మి, ఎంఆర్సీ కార్యాలయ అకౌంటెంట్ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ ఎ.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారి ద్రాక్షారామ రోడ్డులోని పెద్ద వంతెన వద్ద శాంతిన గర్ యూత్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు కేతా శ్రీను, కోటి శ్రీకన్య, కేతా సుజాత చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాతలు పెంకే కల్కిమూర్తి, ఆయన కుమారులు అందించిన రస్నాను ప్రయాణికులకు అందజేశారు. కార్యక్రమంలో కోటి కనకదుర్గారావు, కేతా శ్రీను, యూత్ కమిటీ సభ్యులు టేకుమూడి అన్నమయ్య, రాయుడు గోపి, ధర్మవరపు కృష్ణ, కేతా సూరిబాబు, అనుసూరి సూరిబాబు పాల్గొన్నారు.

చేకూరికి ఘన నివాళి

కపిలేశ్వరపురం: అంగర గ్రామ ప్రముఖుడు చేకూరి వీరవెంకట నాగేశ్వరరావుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు. అంగరలో శనివారం నిర్వహించిన చేకూరి సంతాప సభలో గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచులు సంకాబత్తుల స్వామికాపు, వంగా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులుఅర్జున రావు, రామస్వామి సంతాపం వ్యక్తం చేశారు.